

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"మనకీ పెళ్ళయి, పిల్లలు పుడితే ఇలాగే హాయిగా సినిమా చూస్తూ కారప్పూస తినడం మానేసి వాళ్ళ మీద అరుస్తామంటావా?" అని యాషీని అడిగాను.

అది బాధగా "అసలు మనం పెళ్ళి అనేది చేసుకుంటామా? మనకి చూసుకోవడం రాదు. ఇంట్లోవాళ్ళు చూసేవాళ్ళు మనకి నచ్చరు" అంది.

"ఐ నో. వెరీ వెరీ ఛాలెంజింగ్" అన్నాను.

యాషీ నా పక్కన పడుకుని "అసలు ప్రబంధ్ ముద్దు పెట్టుకున్నప్పుడు ఎలా వుందే?" అంది.

"ఆ బేబీ కిస్‌ని కిస్ అంటారా?" నేను విరక్తిగా చూసాను.

"క్రైమ్ కూడా ధైర్యంగా చెయ్యలేని మంచివాడే డాక్టర్. నేను నా అంతట నేనే దగ్గరవ్వాలని చూసాడుకానీ, తను ఏం చెయ్యాలనుకోలేదు. బహుశా ప్రతిమకి ఇతనికన్నా ఆస్తిపరురాలినని, అహం అనుకుంట. అతనికి మనసుకి నచ్చిన, భావుకత్వంలో సమానంగా వుండే అమ్మాయి కావాలి అనుకుంట. అవ్వాకావాలి. బువ్వా కావాలి టైప్" అన్నాను.

నేను అంత కోపంగా ప్రబంధ్ మీద రివెంజ్ తీసుకోకుండా వుంటే బావుండేది అనిపించింది.

బహుశా ఆలోచనకన్నా ముందు రియాక్ట్ అవడం నా అలవాటు అనుకుంట. కొంచెం ఆగి ఆలోచించాల్సింది. కారు ఎక్కేముందు. అతని గురించి వాకబు చెయ్యాల్సిందేమో

"వాట్ నెక్స్ట్?" యాషీ అడిగింది.

"ఎక్కడికైనా పారిపోవాలనుందే ఈ లైఫ్ నుండి" అన్నాను.

అది తుళ్ళిపడింది "లైఫ్ అనేసావ్ ఏంటీ? ఇల్లు అనో, ఉద్యోగం అనో అనాలి కానీ.." అంది.

ఒళ్ళు విరుచుకుంటూ "లైఫ్ సక్స్" అన్నాను.

బామ్మ తిరుపతి వెంకన్నకి అపరిమిత భక్తురాలు ఇంట్లో నాన్నకి కాస్త ఒళ్ళు వెచ్చబడినా, తిరుమల తిరుపతి దేవస్థానానికి ఐదువందల రూపాయిలు డీ.డీ తీసుకుని పంపమని పోరుతుంది. ఆయనకి ఈ 500రూపాయలతోనే గడిచేట్టు. పైగా ఈ ఫీజ్ ఇవ్వకపోతే పేషెంట్‌ని చూడని స్టార్ హాస్పిటల్ డాక్టరా ఆయన? ఇవి సరిపోక ఏడాదికోసారి వస్తాననీ, వచ్చినప్పుడు జుట్టు ఇస్తాననీ మొక్కుతుంది.

జుట్టంతా పలచపడి లేత జొన్నపొత్తు మీద అక్కడక్కడా పరిచినట్లున్న, గోధుమ రంగు నారలా, పట్టుకుంటే సరిగ్గా గుప్పెటలోకి కూడా నిండా రాని ఈవిడ జుట్టు ఆయనకి ఎందుకు? అక్కడ జరిగే లార్జ్ స్కేల్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్‌కి, విగ్గుల తయ్యారీకీ పనికొచ్చే జుట్టు ఇదైతే మాత్రం కచ్చితంగా కాదు. పోనీ దేహం మీదా, అందం మీదా భ్రాంతి లేదని నిరూపించుకోడానికైతే ఈవిడ వయసుకి అది శుద్ధ అనవసరం.

మా తమ్ముడు హనీష్‌గాడి ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌కీ, నా పెళ్ళికీ, ఇంకా పనికిరాని వాటికీ కూడా తన శిరోజాలని లంచంగా ఇస్తానని వెంకన్నని బ్రైబ్ చేస్తుంటుంది కన్నాంబ.

మర్నాడు పొద్దుటే బీన్స్ తరుగుతూ ఎందుకో బామ్మ కన్నీరు పెడ్తోంది "దాన్ని మొదటినుండీ ఎంతో గారంగా పెంచాం. ఈ పాడు అమెరికా సంబంధం వద్దు అంటున్నా, మా వారు విన్నారు కాదు.. అక్కడ ఏడాదికి ఆర్నెల్లు మంచుట. దాని ఆరోగ్యం అంతా పాడైపోయింది. అసలు మా సీత లంగా ఓణీలో, జడకుచ్చులు పెట్టుకుని పేరంటానికి వెళ్తుంటే, ఊరంతా దిష్టి కొట్టేవారు. ఈ ఇరవై ఏళ్ళల్లో, ఆ పచ్చని రంగూ, జడా అన్నీ పోయాయి" అంది.

నేనూ, యాషీ బుద్దిగా అమ్మ పూజ చేస్తుంటే, దణ్ణం పెట్టుకుని, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాం. నాకు దేవుడితో విరోధం లేదు.  వీళ్ళు చేసే మతిలేని ఆచారలకే కోపం. ఆయన బిజినెస్‌లో నేను వేలు పెట్టి విమర్శించను. ఇన్‌ఫాక్ట్, ఆయన దగ్గర గల్లాపెట్టెలో అమ్మ వేసే చిల్లర నాకెంతో అవసరానికి ఆదుకుంది కూడానూ.

అమ్మ తలస్నానం చేసిందేమో, తలకి టవల్ చుట్టుకుని "వదినకి కులాసాగానే వుంటుందిలెండి. నేను అన్నవరంలో వ్రతం చేయిస్తానని మొక్కుకున్నాను, అని 'చుయ్' మని పెనం మీద దోశ వేసింది.

అమ్మ దగ్గర్లో వున్న యాదగిరి గుట్టా, ద్వారకా తిరుమలా, కనకదుర్గమ్మా అన్నీ వదిలి అన్నవరందాకా ఎందుకు ఆలోచించిందా? అనిపించింది.

బహుశా వైజాగ్‌లో వున్న పెద్దమ్మతో ఏదో ప్రోగ్రాం వుండి వుంటుంది అనిపించి, ఆవిడ ఫస్ట్ వేసిన దోశ యాషీ ప్లేట్లో వేసాను. పక్కన అల్లం పచ్చడి వేసింది. అల్లం పచ్చడో, ఆవకాయపిండో వేసే ఈవిడ, "ఎంచక్కా ఇంట్లో తినొచ్చుగా బయట ఎందుకు తినడం?" అంటుంది.

సాంబార్, పల్లీ పచ్చడీ, కారం పొడీ, అందులో నెయ్యీ, దోశమీద వెన్నపూసా వెయ్యడం ఏమంత కష్టం?

"సీత ఒంటరిదైపోయిందే" బామ్మ కూతురిని తలుచుకుని, కొంగుతో కళ్ళు ఒత్తుకుంది.

అమ్మ అట్లకాడతోనే బామ్మ దగ్గరకి వెళ్ళి "ఊరుకోండి, ఏం కాదు. అవసరమైతే మీ అబ్బాయి వెళ్ళి చూసొస్తారు" అంది.

"నిజమే?" బామ్మ ఆనందంగా అడిగింది.

"ఇంతకీ అత్తయ్యకి ఏమైందీ?" రెండో దోశ తిరగేస్తూ అడిగాను.

"గాలిబ్లాడర్ తీసెయ్యాలి అన్నారుట. చాలా బాధ పడుతోంది నెలరోజులుగా" అంది బామ్మ.

"గాల్ బ్లాడరా?" అన్నాను.

"అవును. ఏదో ఇన్‌ఫెక్షన్‌ట" అంది అమ్మ.

నాన్న వస్తూనే "ఇదిగో అమ్మతో మాట్లాడు. చాలా కంగారు పడుతోంది. అవసరమైతే నేనో, మీ వదినో ఎవరో ఒకరం వస్తాంలే" అని బామ్మకి ఫోన్ ఇచ్చారు.

నేనూ యాషీ రణధీర్ కపూర్ సినిమాకి వెళ్ళాలి అని ప్లాన్ చేసుకుంటున్నాం. థియేటర్స్‌లో సినిమాకి వెళ్ళి చాలారోజులు అవుతోంది.

"రుషిని పంపమంటావా? అదేం చేస్తుందీ?" అని బామ్మ పెద్దగా అనడంతో తుళ్ళిపడి ఇహలోకంలోకి వచ్చాను.

"వాట్?" అన్నాను.

బామ్మ ఫోన్ ఇవ్వడానికి నా దగ్గరికి వస్తూ "పరీ చదువుకోడానికి వెళ్ళి ఎక్కడో దూరంగా ఉందిట. కొంచెం నువ్వైతే సాయంగా వుంటావని అత్తయ్య అంటోంది" అంది.

నేను అమాంతం ఫోన్ లాక్కుని "అత్తయ్యా ఎలా వున్నావ్?" అన్నాను.

"అస్సలు బాగాలేనే. నువ్వు రావే. అన్నయ్యకి ఆఫీసూ, మీ అమ్మకి భాష ప్రోబ్లం ఇక్కడ. నాకు కాస్త సాయంగా వుంటావ్ నువ్వైతే" అంది డైరెక్ట్‌గా పాయింట్‌లోకి వస్తూ సీతత్తయ్య.

రాత్రి నేను "ఎక్కడికైనా పారిపోవాలనుంది ఈ లైఫ్ నుండి" అనడం ఈ వెంకన్న విన్నాడా? ఆడపిల్లల ప్రైవేట్ టాక్. ఆ సమయంలో వినడం కరెక్టేనా? అనిపించింది.

"అత్తయ్యా వీసా వస్తుందా? నిన్ననే జాబ్ మానేసా. ఐ యామ్ ఫ్రీ" అన్నాను.

అమ్మా, నాన్నా టక్కున నావైపు తిరిగి చూసారు.

నాన్న హేళనగా నవ్వి, నేను చెప్పలేదూ అది ఎక్కువకాలం ఎక్కడా ఠికాయించదనీ.. అన్నట్లు అమ్మవైపు చూసారు. ఓ రెండు పేరాగ్రాఫ్‌లు రాసి అబ్బాయి భావాలన్నీ, అలా చూసాడు అతను ఆ అమ్మాయి వైపు. అని పాత తరం రచయితలు రాసినట్లు కాదు. నాన్న నవ్వుకీ చూపుకీ నాకు అర్ధం తెలుసు. పాతికేళ్ళ పైగా ఆయన నాకు తెలుసుకదా.

యాషిక దోశ తినడం మానేసి, నేను ఇంత అర్ధాంతరంగా నా అంగీకారం చెప్పడం ఆశ్చర్యంగా చూస్తోంది.

కాసేపు ఈ విషయమై తర్జన భర్జనలు జరిగాక అమ్మకూడా ఒప్పుకుని "మరి బుద్ధిగా వుంటావా?" అంది.

"నాలాగా వుంటా" వేళ్ళు నాకుతూ చెప్పాను.

"అత్తయ్యకి కాస్త ఆసరాగా వుంటావ్ పోనీలే తల్లీ తోడూ అన్నారు అందుకే" అంది బామ్మ.

"అక్కడ తెలుగు వాళ్ళల్లో మంచి సంబంధం కుదిరితే బావుండు" అంది అమ్మ.

"నేను మార్స్‌కి వెళ్తున్నాను, ఎయిరోనాట్‌గా సెలెక్ట్ అయి అన్నాకూడా మార్స్‌లో మనవాళ్ళు ఎవరైనా వుంటే దీనికి సంబంధం కుదిరితే బావుండు అంటావ్. అసలు నన్ను వదుల్చుకోడానికి ఎందుకింత తపనా?" అడిగాను చిరుకోపంగా.

"నీకిప్పుడు తెలియదు. నీకూ పెళ్ళయి ఓ పిల్లపుడితే"

"రియల్లీ" లేచి చెయ్యి కడుక్కున్నను.

"మీ సీతత్తయ్య అంటే నీకు అంత ప్రేమా?" యాషీ బయటకి రాగానే అడిగింది.

"అమెరికా వెళ్ళాలని వుంది" అన్నాను.

చదువూ, ఉద్యోగంలాంటి బాధ్యతలు లేకుండా ఇలా స్వేచ్ఛగా అమెరికా వెళ్ళడం ఎంత అదృష్టం.

స్క్రీన్ ప్లేలో మలుపులు పెట్టడం ఆ పైవాడి తర్వాతే ఎవరైనా.

నా సెల్ మోగింది. అందులో సిద్ధాంత్ అన్న పేరు కనిపించింది.

"ఇదేవిటో సిద్దాంత్ పేరొస్తోంది" అన్నాను యాషీతో కంగారుగా.

యాషీ 'ఈజ్ ఇట్?' అన్నట్లు చూసింది.

ఇంజనీరింగ్ చదివేటప్పుడు నా 'క్రష్' సిద్దాంత్. సెకండ్ యియర్లో అతను రిధమతో తన రిధం కలిపి నన్ను అంజాన్ కొట్టేటప్పటికి, హార్ట్ బ్రేక్ అయి అసలు ఇంజనీరింగే నాకు అచ్చి రాలేదని మానేసాను.

"హలో" అనగానే

"బడ్డీ నేను సిద్దూని" అన్నాడు.

"సిద్దూ ఎవరండీ?" వాయిస్‌లో సీరియస్‌నెస్ తెచ్చుకుంటూ అడిగాను.

"అరే! నా వాయిస్సే మర్చిపోయావా? సెల్‌లోంచి నా పేరే డిలీట్ చేసావా? ఇట్స్ ఓకే. నేను సిద్దాంత్‌ని. కొంచెం నీతో మాట్లాడాలి" అన్నాడు.

"ఇప్పుడు కుదరదు. నేను అమెరికా వెళ్తున్నాను" అన్నాను. మొదటిసారి అమెరికా వెళ్లడం ఇచ్చే థ్రిల్‌లో కాస్త గర్వంగా అనిపించింది.

"ప్లీజ్.. ఒక్కసారి నేనూ మళ్ళీ వారంలో కువైట్ వెళ్తున్నాను" అన్నాడు.

"ఆయిల్ బావులేమైనా కొన్నావా?" వేళాకోళంగా అన్నాను.

"నో..నో. బిజినెస్సే కానీ వెళ్ళేముందు నిన్ను కలవడం అర్జెంట్" అన్నాడు.

అలా ఎవరైనా అంటే ఎవరికైనా కుతూహలం కలుగుతుంది కదా! "సరే సాయంత్రం పారడైజ్‌కి రా. జస్ట్ ఫైవ్ మినిట్స్. అంతే" అన్నాను.

"కలిసాక ఫైవో, ఫిఫ్టీనో చూద్దాంలే" నవ్వాడు.

యాషీ వైపు చూస్తూ హేళనగా "నీ అతి అస్సలు తగ్గలేదే ఇంకా?" అన్నాను.

"చూపిస్తాను రా. షార్ప్ సిక్స్‌కి ఓకే నా?" అన్నాడు.

"ఓకే" అన్నాను.

యాషీ ఎక్జైట్ అయిపోతూ "ఏం చెప్తాడు అంటావ్?" అంది.

"ఏదో ఒకటిలే. జాలేసి కమిట్ అయ్యాను" అన్నాను.

పారడైజ్ ముందు వెయిట్ చేస్తుంటే, ఖరీదైన కారులోంచి "హాయ్" అంటూ దిగి నా దగ్గరికొచ్చాడు సిద్దాంత్.

అతని జుట్టు కొంచెం పలచబడిందేకానీ హాండ్సమ్ గానే వున్నాడు. రివటలా వుండేవాడు. కొంచెం ఒళ్ళు వచ్చింది. బ్రిల్ క్రీమ్ పెట్టి హెయిర్ బాగా దువ్వాడు. నేవీ బ్లూ టీషర్ట్ మీద వైట్ జాకెట్, టోర్న్ జీన్స్, కళ్ళజోడు, ఆడపిల్లలు మనసు పారేసుకునే లెవెల్లోనే వున్నాడు.

"ఏమిటి?" సూటిగా అడిగాను.

కాజువల్‌గా వైట్ స్కర్ట్ మీద బ్లాక్ టీ షర్ట్ వేసుకుని జుట్టు పిచ్చుక గూడులా నడినెత్తిమీద కొప్పు పెట్టి, క్యాజువల్‌గా కనపడడానికి చాలా ప్రయాస పడ్డాను.

"పద ఆకలేస్తోంది. హలీమ్ తిందాం" అన్నాడు.

"హలో! ఇక్కడ పక్కా వెజిటేరియన్" అన్నాను.

"కంపెనీ ఇవ్వు" నా భుజం మీద హక్కుగా చెయ్యివేసి నడుస్తూ అన్నాడు.

ఖాన్ వచ్చి మా టేబుల్ దగ్గరకి "హలో చాలా రోజులకి. సలామాలేకుం" అన్నాడు.

అక్కడ పనిచేసే మేనేజర్ అంతలా విష్ చేసాడంటే అర్ధం అవుతోంది కదా, అది మేం కలుసుకునే రెగ్యులర్ అడ్డా.

సిద్ధూ నవ్వుతూ 'హాయ్ బాస్' అని అతనికి చెయ్యి కలిపాడు. వెంటనే నన్ను అడగకుండా రెండు హలీమ్ అన్నాడు.

నేను అతన్నే చిరాగ్గా చూస్తూ కూర్చున్నాను.

ఖాన్ వెళ్ళిపోయాక "చెప్పు ఏంటో అర్జెంట్ అన్నావ్?" అన్నాను.

"కువైట్‌లో మేం హార్డ్‌వేర్ బిజినెస్ చేస్తున్నాం. ఇంట్లో అమ్మా నాన్నా చాలా గొడవ చేస్తున్నారు పెళ్ళి చేసుకోమని. మా తమ్ముడు ఒక గుజరాతి అమ్మాయిని ఆల్‌రెడీ లవ్ చేసి, పెళ్ళికీ, సంగీత్‌కీ లొకేషన్స్ వెతుకుతున్నాడు. సో ఇంకా ప్రెషర్ పెరిగింది నామీద" అన్నాడు.

"సరే దివ్యంగా చేసుకో. నీ రిధిమ వుందిగా?" అన్నాను.

"డార్లింగ్. ఏదో కాలేజ్‌లో ఇన్‌ఫ్యాక్చుయేషన్ అదంతా ఫన్ అంతే" అని హలీమ్ రావడంతో మాటలు ఆపి, అది స్పూన్‌తో తీసి నా నోటి దగ్గర పెట్టాడు.

"చెప్పాగా, నేను ప్యూర్ వెజిటేరియన్‌ని" అన్నాను.

"లైఫ్‌లో ఫన్ అంతా ఇలాగే మిస్ అవుతావ్. అనవసరంగా నాతో మాట్లాడడం మానేసావ్. కానీ నేను మాత్రం నిన్ను మిస్ అవదలచుకోలేదు" వేళ్ళు నాకుతూ చెప్పాడు.

"అమ్మా వాళ్ళు పెళ్ళి అనగానే నువ్వే గుర్తొచ్చావ్. నిన్ను లంగా ఓణీలో, చీరలో నేను ఎంత ఇష్టపడ్తానో తెలుసుగా. అందుకేనా ఇంత అరాచకంగా తయారయి వచ్చావ్. మొహానికేం రాసుకున్నావ్? జిడ్డుగా" అని నవ్వాడు.

నేను వెనక్కి వాలి ఏం మాట్లడకుండా చుస్తూ కూర్చున్నాను.

"నిన్ననే గలీ దగ్గచ్చిబౌలి దగ్గర ఓ విల్లాకి అడ్వాన్స్ ఇచ్చాను. సంపాదనలో స్థిరపడ్డాకే నీ దగ్గర మేరేజ్ ప్రపోజల్ తీసుకొద్దాం అని ఆగాను" అన్నాడు.

"అందుకా? గర్ల్‌ఫ్రెండ్ బిస్కెట్ ఇస్తే, ఇంట్లో తమ్ముడి పెళ్ళితోబాటు నీ పెళ్ళీ చేసేస్తాం అని, ఓ శ్రీగానా పెసూనాంబలాంటి అమ్మాయిని కట్టబెడ్తాం అన్నందుకా?" కోపంగా అన్నాను.

అతను పెద్దగా నవ్వాడు "నువ్వు మాత్రం శీగాన పెసూనాంబకి తీసిపోయావా? నువ్వు వేసుకున్న డ్రెస్, నీ స్టైల్ ఫ్యాషన్ అనుకుంటున్నావా?" అని నా వైపు చూసి "ఉక్రోషంతో వూగుతున్న నీ చెవి రింగు బందరు మిఠాయి కోట్లో చేసే చేగోడీలా వుంది. నీ ముక్కులు ఆవేశంతో వుబ్బుతుంటే, అమలాపురం పనస తొనలు గుర్తొస్తున్నాయి" అన్నాడు.

"నువ్వు చెప్పే పోలికలతో సహా అన్నీ చెత్తగా వున్నాయి. ఐదేళ్ళ తర్వాత ఉరుములేని వానలా వచ్చావు. నాకు ఇష్టంలేని ఫుడ్ తెప్పించావ్. ఇష్టమా అని అడగకుండా పెళ్ళి గురించీ, నీ ఆస్తి పాస్తుల గురించీ మాట్లాడ్తున్నావు. ఏం చూసి నిన్ను పెళ్ళి చేసుకోడానికి 'ఎస్' అనాలి. నీ విల్లాని చూసా? స్కోడా కారుని చూసా" అన్నాను.

నా చేతి మీద చెయ్యివేసి "సారీ" అన్నాడు.

"బట్ ఐయామ్ నాట్. ఆనందంగా వుంది ఇలా చెప్పే ఛాన్స్ దొరకడం. రేయ్ తొలిప్రేమా, ఆ ఫీలింగ్స్ ఎంత ఫూలిష్‌గా వుంటాయో తెలుసా? నువ్వు ఎప్పుడైనా ఇంటికొచ్చి బయట చెప్పులు విప్పితే, ఆ చెప్పుల్లో కాళ్ళుపెట్టి, ఆనందం అనుభవించేదాన్ని. ఎవరైనా నీగురించి మాట్లాడ్తుంటే, వేణుగానం వింటున్నట్లు చెవులు రిక్కించి వినేదాన్ని, నీ పేరు, నా పేరు చివర రాసుకుని నోట్‌బుక్‌లో పేజీలన్నీ నింపేదాన్ని... చెత్త వెధవా! నీ కోసం నాన్‌వెజ్ తినడానికి కూడా రెడీ అయ్యానురా ఆ టైములో. నా హృదయం పగలకొట్టి వెళ్ళిపోయావ్, ఇలా ఇంత దర్జాగా ఎలా మాట్లాడ్తున్నావ్? పెళ్ళీ గిళ్ళీ అని? నీ డబ్బా, తండ్రి ఇచ్చిన ఆస్తీ ఇచ్చాయా దమ్ములు? ఆడపిల్లకి కావలసింది నీ కువైట్ దీనార్‌లూ, నీ విల్లాలూ కాదు, 'వీడు నన్ను వదిలి పెట్టిపోడు అన్న నిశ్చింత' అది నువ్వు ఎలానూ ఇవ్వలేవు. బై. వస్తా" అన్నాను.

అతను మాట్లడలేదు, నేను లేస్తుంటే, "వెళ్ళు.. ఏదో ఫస్ట్ లవ్ అని సెకండ్ ఛాన్స్ ఇచ్చా, గొప్ప అందగత్తెవి అని మిడిసి పడకు. నీకు ఆ అమ్మమ్మ కాలం రింగులు ఏం సూట్ కాలేదు. వెళ్ళు మీ అయ్య ఓ గవర్నెమెంట్ గుమాస్తాకిచ్చి చేస్తాడు" అన్నాడు.

"ఫర్లేదు. రిధిమో.. గధిమో వస్తే పరిగెత్తేవాడు కాకపోతే చాలు" అన్నాను.

బయటికొస్తుంటే ఆ సాయంత్రం అంత త్వరగా ముగిసినందుకు ఆశ్చర్యంగా అనిపించింది.

యాషీకి కాల్ చేసాను.

ఇద్దరం బిర్లా మందిర్ మెట్లమీద కూర్చుని వుండగా అడిగాను" బీర్ తాగుదామా?" యాషీ ఇంకా ఆశ్చర్యంగా చూసింది.

"సునైన రూములో వుందో లేదో ఫోన్ చేస్తా" అంది.

సునైన రూములో ఏదో కొత్త హిందీ సినిమా పాట వినిపిస్తోంది.

"అంత లౌడ్‌గా వద్దే నైనా. వాల్యూం తగ్గించు" అన్నాను.

యాషీ గ్లాసుల్లో బీరూ, ప్లేట్లో పకోడీలు తెచ్చాక అంది "నువ్వింత గాఢంగా ఆ సిద్ధాంత్‌గాడ్ని ప్రేమించావని ఇప్పుడే తెలిసిందే" అని.

గతుక్కుమన్నాను. ప్రేమలో విఫలం అయితే తాగాలి అన్న సిద్ధాంతం అప్పుడెప్పుడో మా అమ్మమ్మల కాలంలో దేవదాసు అన్నవాడు సృష్టిస్తే ఇప్పటికీ దాన్ని ఫాలో అవుతున్న మా జేనరేషన్ ఏం ట్రెండ్ సృష్టించినట్లు మరీ?

"డోంట్ పోక్ హర్" అంది నైనా జాలిగా.

"అంత జాలి పడకండి. అమెరికా వెళితే మళ్ళీ కుదరదని జాలీగానే తాగుతున్నాను" అన్నాను.

ఫోన్ ఓపెన్ చేస్తే సిద్ధాంత్ దగ్గరనుండి మెసేజ్.

"మనసు మార్చుకుంటే చెప్పు. నువ్వు వుత్త ఫూల్‌వి" అని.

నాకింకా ఒళ్ళుమండింది. అసలు ఏవిటి వీడి బోడి డామినేషన్? అని.

రాత్రి అమ్మ నాన్నతో "పెళ్ళి చేసి ఒకింటికి పంపించాల్సిన పిల్లని. ఇలా అమెరికా పంపడం కరెక్టేనా?" అనడం వినిపించింది.

"అసలు దీన్ని ఎవడైనా చేసుకుంటాడంటావా?" నాన్న కంఠం.

ఎంత నమ్మకమో పాపం.

"నేను ఇప్పుడే ఒకడ్ని రిజెక్ట్ చేసి వస్తున్నాను, విల్లా వున్నవాడిని. కువైట్‌లో బిజినెస్‌లున్న వాడిని అని తలుపు తోసుకుని వెళ్ళి చెప్పాలనిపించింది. అంత రాత్రి సభ్యత కాదని వూరుకున్నాను.

మంచినీళ్ళకోసం కిచెన్‌లోకి వెళ్తుంటే తూలాను.

అమ్మ చూసి "ఏవిటే తూలుతున్నావ్" అంది.

"తాగొచ్చాను" అన్నాను.

"ఈ పొగరే తగ్గించుకోమనేది నిన్ను" అంది.

పిచ్చి అమ్మ నిజాలు చెపితే ఎప్పుడూ నమ్మదు పాపం.

అత్తయ్య దయవల్ల వీసా ప్రొసెసింగ్ అదీ వేగంగా జరిగిపోయాయి. నేను టికెట్ కొన్నప్పటినుండీ ఇంట్లో అమ్మ తప్ప అంతా ఆనందంగా వున్నారు.

"ఏవిటో పెళ్ళి చేసుకుని ఆనందంగా హనీమూన్‌కి వెళ్ళాల్సిన పిల్ల ఇలా ఒక్కత్తే ప్రయాణాలు" వెనకనుండి ఆకాశవాణి రేడియో నాటికలలో వచ్చే విషాద సంగీతం వస్తున్నట్లు అనిపిస్తుంది నాకు. అప్పుడే నాకు అనిపిస్తుంది ఈ పిచ్చి అమ్మ ఎన్నడూ ఒంటరిగా ప్రయాణాలు చేసి వుండదు. రాజమండ్రి నుండి వాల్తేరు తప్ప. అదీ నాన్న బస్‌లో పక్కనున్న బామ్మగారికీ, ఎదురుగా వున్న రౌడీ కుర్రాడికీ, బస్ డ్రైవర్‌కీ కండక్టర్‌కీ అప్పచెప్పి, ఎందుకైనా మంచిదని ఆఖరి నిమిషంలో తను బస్ ఎక్కేసే వుంటాడు.

ఇంత కేర్ తీసుకోడానికి ప్రతి భర్తా, ఓ సీరియల్ కిల్లర్ ప్రతి బస్‌లో వుంటాడని నమ్మకమా? లేక తన భార్య ప్రిన్సెస్ డయానా, లేదా తమన్నా మాదిరి అందగత్తె అనా?

పాపం నూనె కారుతూ, గట్టిగా బిగించి పిలకజడ వేసుకుని పద్దతిగా ఆరుగజాల ముతక చీరలో వున్న సుబ్బలక్ష్మిని కూడా, "పైట సరిగ్గా వేసుకో.. పైట.. పైట " అనే ప్రబుద్ధులుండేవారుట. ఈ జిడ్డుగారే సుబ్బలక్ష్మిని చూస్తే ఎంత సన్నాసికైనా మనసు చలించదు. సన్నాసి ఎందుకన్నానంటే, మరి చేపలు పట్టే అమ్మిని చూసినా, పని అమ్మాయిని చూసినా చిత్త భ్రమ కలిగి మహాభారతాలు సృష్టించిన సన్నాసులు గురించి కథలు చదివానుగా.

"ఇట్స్ ఓకే వసుందరా. నేను ఏ అబ్బాయి మాయమాటలూ నమ్మి, అతనితో ఫ్లైట్ మధ్యలో దిగి వెళ్ళిపోను. నీమీదొట్టు" అన్నాను నాటకీయంగా.

"ఎవడినైనా నువ్వు మాయ చేస్తేనో పాపం?" అంది అమ్మ.

అమ్మో వసుంధర తక్కువ పంచ్‌లు వెయ్యదుగా. ఎట్టా? నేను ఎవడినైనా మాయ చేస్తానా? అంత కిలాడీ కిట్టమ్మనా? అనుకుని నవ్వుకున్నాను.

బామ్మ రెచ్చిపోయి పిండి వంటలు చేస్తోంది. ఇన్ని తీసుకెళ్ళనివ్వరు. అని నాన్న చెప్తున్నా అమ్మ షాపింగ్‌లు చేసి సీత అత్తయ్యకీ, మావయ్యకీ బట్టలూ, స్వీట్లూ, పచ్చళ్ళూ అన్నీ సిద్ధం చేసేస్తోంది. అసలు అమ్మకీ రావాలనే వుంది అనుకుంట "అక్కడ మెట్లు బదులు ఎస్కిలేటర్లు వుంటాయిట. అందుకే వెళ్ళటం లేదు నేను" అని పక్కింటావిడతో చెప్తుంటే

విన్నాను. లేదా క్రిష్టారావుకి ఫేవరెట్ వంకాయ ఉల్లికారం, కంది పచ్చడీ, ఉల్లిపాయ పులుసూ ఎక్స్ట్రా... ఎక్స్ట్రా ఎవరు చేస్తారనా?

ఇండియాలో ఆడవాళ్ళకి, తమ వంటకి అలవాటు పడిన భర్తలు అస్సలు హోటల్ తిండి తినరనీ, ఇంకో స్త్రీ దగ్గరకి... ఎందుకులే అంతదూరం ఆలోచించరు కానీ భర్తకి ఇంకో అమ్మాయితో సహవాసం వుండదని గొప్ప నమ్మకం. అధవా ఎవరితోనైనా మాట్లాడ్డం చూస్తే "మీ అన్నయ్యగారికి మీ ఇంట్లో చేగోడీలు నచ్చాయిట వదినా. పాళ్ళు ఎలా వేసారు?" అని వరస కలిపి, నిశ్చింతగా నిట్టూరుస్తారు. ఇది గెలవేసిన అరటి చెట్టుకి మడి బట్ట కట్టినట్లే పాపం.

నా ప్రయాణం రోజున పొద్దుటే లేపి అమ్మ "స్నానం చెయ్యి. ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాలి. అక్కడనుండి వినాయకుడి గుడికి వెళ్ళి ఉండ్రాళ్ళు పొయ్యాలి" అంది.

"అంతేనా? వాళ్ళ అమ్మా నాన్నా తమ్ముడూ ఏమీ అనుకోరూ? అసలే కేలండర్లలో కూడా వాళ్ళు ఫ్యామిలీ ఫోటోలిస్తున్నారు, వీళ్లైతే నెమలీ, ఎలుకా, ఎద్దులతో కలిసి.." అన్నాను.

"ఛ! అలా అనకు సముద్రం దాటివెళ్తున్నావ్ అసలే" అని లెంపలు టపటపా వేసుకుంది.

రాత్రి పన్నెండు గంటలకి ఫ్లైట్. దుబాయ్‌లో మారాలి. సాయంత్రం ఐదు గంటలకి సూట్‌కేసులు ఎక్కి తొక్కి వాటిమీద గుర్రం ఆట ఆడి నాన్న, కార్లో పెట్టేసారు.

"నా కూలింగ్ గ్లాసెస్.. జాకెట్" ఏమడిగినా, ఆల్ రెడీ సర్దేసి కార్లో పెట్టేసారు" డాడీ.

సగం పచ్చడి ప్యాకెట్లు వెనక్కొస్తాయి ఎయిర్‌పోర్ట్ నుండి. అమ్మ పెట్టిన గన్ పౌడర్లూ, గట్రా చూసి నన్ను టెర్రరిస్ట్ అనుకుని 'టాడా ' కిందబుక్ చేసినా చెయ్యొచ్చు" అన్నాను.

"ఛ! వెధవ అశుభం మాటలూ" అని బామ్మ సాయిబాబా విభూది పెట్టింది నుదుటునా, నోట్లోనూ.

నేను అసలు ప్రోటీన్ పౌడర్ కన్నా ఎక్కువ విబూది తినే పెరుగుతున్నట్లున్నాను. చెవి నొప్పి అంటే విబూది, కంట్లో కురుపు.. విబూది, పొట్టనెప్పి, కాలు బెణుకు... అన్నింటికీ విబూది. ఓ మై సుపర్‌స్టీషియన్ ఫెలోస్ అనుకున్నాను.

"కిటికీ దగ్గర కూర్చో" బామ్మ చెప్పింది.

"పక్కవాళ్ళు తల బయట పెట్టి ఉమ్మితే నామీద పడ్తుంది ఒద్దు" చెప్పాను.

"నాకు తెలుసులే, కిటికీలు తెరవరని" బామ్మ నవ్వింది.

బామ్మకి నవలలు చదివిన అనుభవం వుంది. ఆవిడ అభిమాన రచయిత బలభద్ర.. ఏదో నోరు తిరగని పేరులే. నాకెందుకు? ఆ సున్నితత్వాలూ.. భావుకత్వాలూ. పేజీల పేజీల విరహాలూ, టన్నుల టన్నుల త్యాగాలూ నా ఒంటికి పడవు.

"సీతని జాగ్రత్తగా చూసుకోవే" నన్ను దగ్గరకి తీసుకుని అంది కన్నీళ్ళతో బామ్మ.

నేను వెంటనే బుగ్గమీద ముద్దు పెట్టి "డోంట్ వర్రీ డియర్" అన్నాను.

పాపం  వసుంధర కూడా దిగులుగా వుంది. నేను వెళ్ళాక ఎవరిని తిట్టాలో తెలీక. చాలా మిస్ అవుతుంది. గోపాలం బావలా, పెళ్ళాం లేని వాళ్ళ గురించి వాకబ్ చేసి జాతకాలు సమీకరిస్తుంది. వీళ్ళు సి.బి.సి.ఐ.డీ కన్నా పెద్ద నెట్‌వర్క్‌తో గోచీ తీసి ప్యాంట్ వేసిన ప్రతివాడి రెస్యూమీ తమ సిస్టంలో ఫీడ్ చేస్తుంటారు. వీళ్ళదో ఇంటర్నేషనల్ గ్రూప్ 'మమ్మీస్ నెట్‌వర్ ' అని.

ఇంక నాన్న పాపం నిజం బెంగే. చిన్నప్పటినుండీ నన్ను ఎక్కడికి పంపాలన్నా ఇష్టం వుండదు. పిక్నిక్‌కి వెళ్తానంటే డబ్బులు లేకకాదు భయంతో "డబ్బులు లేవు" అనేవాడు.

ఐ కెన్ అండర్ స్టాండ్ హిజ్ లవ్. డాడ్స్ ఆర్ మోస్ట్ అండర్ రేటెడ్ పేరెంట్స్ అమ్మ ప్రేమల గురించే సినిమాలన్నీ తీస్తారు. నాన్న గురించి మన చిన్నప్పటినుండీ అమ్మ విలన్‌లా చూపిస్తుంది. "నాన్న తిడ్తారు" "నాన్నకి చెప్తా" అన్న బ్లాక్ మెయిలింగ్‌తో.

COMMENTS